క్లుప్తంగా

క్లాప్, గ్రీన్‌మిత్రలకు శిక్షణ



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రాంప్రసాద్

సీతంపేట: మండల కేంద్రంలోని ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్‌లో క్లాప్, గ్రీన్‌మిత్రలకు వ్యర్థాల నిర్వహణపై రెండు రోజుల శిక్షణ ఇచ్చారు. డీఎల్‌పీఓ జె.రాంప్రసాద్ శనివారం జగిన శిక్షణలో మాట్లాడుతూ.. ప్రతి ఇంటి నుంచీ చెత్తను సేకరించాలన్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించే విధానం, వర్మీకంపోస్టు తయారీపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.గీతాంజలి, ఈఓపీఆర్‌డీ సత్యం, రిసోర్స్‌పర్సన్ కన్నబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం

పాలకొండ: పట్టణంలోని పూర్వ విద్యార్థుల గ్రంథాలయం వద్ద సాహితీ సుధ డవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన వైద్య నిపుణులు శిబిరంలో పాల్గొని రోగులను పరీక్షిస్తారని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు శిబిరం కొనసాగనుందని, రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫారంపాండ్ ఏర్పాటుకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న గ్రామపెద్దలు

భామిని: మండలంలోని బాలేరులో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఫారంపాండ్ ఏర్పాటుకు ఉపాధి ఏపీఓ రేగిడి బాబూరావు ఆధ్వర్యంలో గ్రామపెద్దలు శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. భూగర్భ జలాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట చంద్రశేఖర్, మాజీ సర్పంచ్‌లు ఎం.జగదీశ్వరరావు, పి.కొండయ్య, మత్స్యకార సంఘ అధ్యక్షుడు బర్ల ఆనంద్, బీజేపీ కార్యదర్శి కె.తిరుపతిరావు, గ్రామపెద్దలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రాధాకృష్ణుని సన్నిధిలో భక్తుల కోలాహలం



ఆలయంలో భక్తుల సందడి

భామిని: మండలంలోని లివిరిలో వెలిసిన గోపీనాథా రాధాకృష్ణుల సన్నిధి శనివారం భక్తులతో కిటకిటలాడింది. డోలోత్సవాల్లో భాగంగా రాధాకృష్ణులకు పాలు, పెరుగు, వెన్నలతో చేసిన పానకాల అమృత కళశాలను సమర్పించారు. హరేరామ భక్తులు పలు కీర్తనలు ఆలపించారు.


పన్ను చెల్లించి సహకరించండి



ఇంటి పన్నులు వసూలు చేస్తున్న కమిషనర్ జయరామ్, తదితరులు

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని ప్రజలు ఆస్తి పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ జయరామ్ కోరారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించి ఆస్తి పన్ను వసూలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నులు చెల్లించి తగిన రశీదులు పొందాలని తెలిపారు. ఈ నెల 31లోగా కుళాయిలు, ఖాళీ స్థలాలు, ఇంటి పన్నులు చెల్లించని పక్షంలో, వచ్చే నెలలో వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

యాజమాన్య పద్ధతులు తప్పనిసరి



యాజమాన్య పద్ధతులు వివరిస్తున్న కేవీకే సైంటిస్ట్ హరికుమార్

సీతంపేట: జీడి పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలని కేవీకే సైంటిస్ట్ హరికుమార్ అన్నారు. మండలంలోని గజిలి గ్రామంలో జీడిపంటపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏయే రకాల మొక్కలు నాటుకుంటే అధిక దిగుబడులు వస్తాయో వివరించారు. అలాగే ఇప్పటికే ఉన్న చెట్లకు ఆశించే టీ దోమ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఎండుకొమ్మలు, పాకే కొమ్మలను తొలగించాలన్నారు. జీడి పంటలో పసుపు, పైనాపిల్‌ను అంతర పంటలుగా సాగు చేసుకుని అదనపు ఆదాయం పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఓ పి.జయశ్రీ పాల్గొన్నారు.

కొండచీపుర్ల కొనుగోలుపై..

మరీ అంత నిర్లక్ష్యమా...?

- గిరిజన ఇళ్లల్లో పేరుకుపోతున్న నిల్వలు..
- ఊరూరా తిప్పి అమ్ముకుంటున్న వైనం
- పట్టించుకోని జీసీసీ అధికారులు



వారపు సంతలో అమ్మకం కాని కొండచీపుర్లు

భామిని: గిరిజనులు పండించిన, సేకరించిన అటవీ ఉత్పత్తులను తామే కొనుగోలు చేసి మద్దతు ధర అందిస్తాం.. ఎట్టి పరిస్థితుల్లోనూ గిరిజనులు దళారీల బారిన పడకుండా చూస్తామని జీసీసీ అధికారులు ఎప్పటికప్పుడు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారు. తమ సంస్థకు ఎక్కువ లాభాలు చేకూర్చే ఉత్పత్తులనైతే వెంటవెంటనే కొనుగోలు చేసే జీసీసీ అధికారులు సాధారణ ఉత్పత్తుల కొనుగోలు వైపు మాత్రం దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కోవలోకే వస్తాయి కొండచీపుర్లు.. ప్రస్తుతం తివ్వా కొండల్లో కొండచీపుర్ల తుప్పలు బాగా పెరగడంతో గిరిజనులు వాటిని సేకరిస్తున్నారు. ప్రతి ఒక్క గిరిజనుడి ఇంటిలో కొండచీపుర్లు కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. అయితే వీటిని విక్రయించుకోవాడానికి మాత్రం



తివ్వాకొండల్లో ఏపుగా పెరిగిన కొండచీపుర్ల తుప్పలు

అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. మైదాన ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి అమ్ముకుంటే కనీసం కూలి కూడా గిట్టుబాటు కావడం లేదని గిరిజన బిడ్డలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోనీ సంతల్లో విక్రయిద్దామన్నా ఆశించిన స్థాయిలో అమ్మకాలు జరగడం లేదు.

పట్టించుకోని జీసీసీ

కొండచీపుర్లను కొని గిరిజనులను ఆదుకోవాల్సిన జీసీసీ అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. కొద్దో గొప్పో చీపుర్లను కొనుగోలు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారే తప్ప పూర్తిస్థాయిలో సహకరించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో తమ ఇళ్లల్లో కొండచీపుర్ల నిల్వలు పేరుకుపోతున్నాయని మండల గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొండచీపుర్లను కొనుగోలు చేయాలని పలువురు కోరుతున్నారు.

కొనుగోలు చేయాలి..



గిరిజనుల నుంచి కొండచీపుర్లను కొనుగోలు చేయాలి. ఈ విషయంలో జీసీసీ అధికారుల నిర్లక్ష్యం తగదు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి నేరుగా గిరిజన గూడలకు వెళ్లి చీపుర్లను కొనుగోలు చేయాలి.

– పిరపక శ్రీనివాసరావు, జీసీసీ డైరెక్టర్, లోహరిజోల, భామిని మండలం

కొనుగోలు చేస్తాం..



గిరిజనులు పండించిన కొండచీపుర్లను కొనుగోలు చేస్తాం. గిరిజన ప్రాంతాల్లోని రైతుసేవా కేంద్రాల నుంచి కొండచీపుర్ల స్టాక్ వివరాలు సేకరిస్తున్నాం. ఇప్పటికే 18 వేల చీపుర్లను కొనుగోలు చేశాం. రెండు, మూడో రకాలు మాత్రమే కొనుగోలు చేస్తాం.

– దాసరి కృష్ణారావు, జీసీసీ జనరల్ మేనేజర్, సీతంపేట

ఘనజీవామృతం తయారీపై అవగాహన



ఘనజీవామృతం తయారు చేయిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రాయగడజమ్ము పంచాయతీ, పెంగవ గ్రామంలో ఘనజీవామృతం తయారీపై శనివారం అవగాహన కల్పించారు. జీవ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ జి.ప్రబోధ్.. రైతులతో ఘనజీవామృతం తయారు చేయించారు. అనంతరం దాని ప్రయోజనాలు వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సహజ సిద్ధంగా లభించే ఆవు పేడ, మూత్రం వంటి వాటితో తయారు చేసుకునే ఈ ఘనజీవామృతం ఎరువును ఖరీఫ్ సీజన్‌లో తొలకరిజల్లులకు ముందు వేసుకుంటే నేల సారవంతమవుతుందని, ఆ తర్వాత అదే నేలలో వేసుకునే పంటలు బాగా పండుతాయన్నారు. కార్యక్రమంలో జట్టు కో–ఆర్డినేటర్ జి.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కమిటీ సమావేశం



తాళ్లడుమ్మలో సమావేశమైన గ్రామ బాలల సంరక్షణ కమిటీ సభ్యులు

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి, తాళ్లడుమ్మ గ్రామాల్లో బాలల సంరక్షణ కమిటీ సమావేశాలు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా బాలల సంరక్షణ విభాగం జిల్లా లీగల్ ప్రొహిబిషన్ అధికారి పి.శ్రీధర్ హాజరై, మాట్లాడారు. జీవో నంబరు 1 ప్రకారం పార్వతీపురం మన్యం జిల్లాలోని పంచాయతీల్లో గ్రామస్థాయి పిల్లల సంరక్షణ సమావేశాలు చేపట్టాలన్నారు. పిల్లల సంరక్షణ, సంక్షేమం ముఖ్య ఉద్దేశంగా కమిటీ సభ్యులు పాటుపడాలని తెలిపారు. పిల్లలపై లైంగిక దాడులు, బాల్యవివాహాలు జరగకుండా చూడాలన్నారు. నెలలో రెండు సార్లు సమావేశాలు జరిపి, బాలల సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించాలన్నారు. సమావేశంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి రావాడ హరికృష్ణ, చినమేరంగి సచివాలయం మహిళా సంక్షేమ అధికారి ఎం.వాణి తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలే లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ బాబూరావు

కొమరాడ: సారా రహిత గ్రామాలే లక్ష్యంగా నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్ శాఖ గ్రామ గ్రామాన సారా నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. దీనిలో భాగంగా మండలంలోని గుమడ, కొమరాడ తదితర గ్రామాల్లో శనివారం పర్యటించిన ఎక్సైజ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ ఎస్‌ఐ జి.బాబూరావు.. సారా తాగడం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. సారా తాగితే జీవితం అధోగతి పాలవుతుందని, మానితే పురోగతి సాధ్యమన్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సారా లేకుండా చేసే ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

గరుగుబిల్లి: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని సన్యాసిరాజుపేట, ఉల్లిభద్ర, లఖనాపురం, కొంకడివరం గ్రామాల్లో సారా నియంత్రణపై శనివారం అవగాహన కల్పించారు. సీతానగరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి.. సారా తాగడం వల్ల కలిగే దుష్ప్రభావాలు వివరించి, సారా తయారు చేసినా, తరలించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గరుగుబిల్లి: ఉల్లిభద్రలో అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

సారాను నిర్మూలించండి..



ప్రతిజ్ఞ చేయిస్తున్న సిబ్బంది

సీతంపేట: మండలంలోని కుశిమిగూడలో సారా నిర్మూలనపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సూపరింటెండెంట్ మధుబాబు మాట్లాడుతూ.. సారా మహమ్మారిని సమూలంగా నిర్మూలించాలన్నారు. నవోదయం 2.0 పేరిట ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి సారా తాగడం, విక్రయాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా సారా విక్రయించినా, తయారు చేసినా 14405 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.కూర్మారావు, రాజాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన



బొబ్బిలి కోట సందర్శనలో గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: క్షేత్ర పర్యటనలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు.. విజయనగరం జిల్లా, బొబ్బిలిలోని చారిత్రక ప్రదేశమైన బొబ్బిలి రాజుల కోటను శనివారం సందర్శించారు. అప్పటి రాజులు వినియోగించిన ఆయుధాలు, కోట నిర్మాణ శైలి, అందులోని కళాఖండాలు చూశారు. అనంతరం బొబ్బిలి రాజుల చరిత్రను అడిగి తెలుసుకున్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలు, చరిత్రను తెలుసుకునేందుకు ఈ క్షేత్ర పర్యటనలు ఉపయోగపడతాయని అధ్యాపకురాలు శ్రీవాణి తెలిపారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు వివేక్ ఆనంద్ శ్రీనివాస్

సీతంపేట: బాలికలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్, సెక్రటరీ ఆర్.సన్యాసినాయుడు సూచించారు. శనివారం స్థానిక వైటీసీలో 8,9 తరగతుల విద్యార్థినులకు ఆడపిల్లలపై జరుగుతున్న అత్యాచారాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయడం నేరమని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆర్.కుమార్ స్వామి, ఎం.శ్యామ్యుల్ పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): గిరిజన రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 29వ తేదీన పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు అనిల్, వాసు తదితరులు పిలుపునిచ్చారు. ఇదే విషయమై రూపొందించిన వాల్‌పోస్టర్లను కురుపాం మండలంలోని మొండెంఖల్లు గ్రామంలో శనివారం ఆవిష్కరించారు. జీడిపిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలని, గుమ్మలక్ష్మీపురం, సాలూరు, సీతంపేట మండలాల్లో జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని, అలాగే అన్ని గిరిజన గ్రామాలకు రోడ్లు, తాగునీరు, బస్సు సదుపాయాలు కల్పించాలని, పోడుభూములకు పట్టాలు ఇవ్వాలని, నిరుపేద గిరిజనులకు ఇంటి స్థలంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు.

ముగిసిన అంగన్‌వాడీల శిక్షణ



శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పాలకొండ: ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా సీడీపీఓ సిమ్మాలమ్మ మాట్లాడుతూ.. చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఆరోగ్యకరంగా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ పాఠశాల(బాలురు)లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.వరప్రసాద్‌బాబు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. నాలుగో తరగతి పూర్తి చేసిన బాలురు అర్హులని, ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6, 7, 8, 9 తరగతుల్లోని మిగులు సీట్లు కూడా భర్తీ చేయడం జరుగుతుందన్నారు. పని వేళల్లో పాఠశాలకు వచ్చి, దరఖాస్తులు సమర్పించాలన్నారు.

ఈ నెల 26 నుంచి క్రికెట్ టోర్నమెంట్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలం, నీలకంఠాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మలక్ష్మీపురం గ్రామ మైదానంలో ఈ నెల 26వ తేదీ నుంచి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ ఎ.నీలకంఠారావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు జట్టు సభ్యుల పేర్లు ఈ నెల 25వ తేదీలోగా ఇవ్వాలన్నారు. తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ.10 వేలు, రూ.5 వేలు ఇవ్వడంతో పాటు ప్రోత్సాహక బహుమతులు కూడా అందజేయడం జరుగుతుందన్నారు. ఎంట్రీ ఫీజు లేదని, మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 6304067308, 8074949913ను సంప్రదించాలని కోరారు.

రికార్డ్స్ ఆఫ్ రైట్స్‌పై శిక్షణ

సీతంపేట: చిన్నబగ్గ పంచాయతీ సంకిలిలో అటవీ హక్కుల చట్టం ఎఫ్‌ఆర్‌సీ సభ్యులకు రికార్డ్స్ ఆఫ్ రైట్స్‌పై వెలుగు సంస్థ ఆధ్వర్యంలో శనివారం శిక్షణ ఇచ్చారు. అడవికి, ఆదివాసీలకు ఉన్న సంబంధాన్ని తెలియజేయడంతో పాటు అటవీహక్కులు పొందడం వల్ల కలిగే లాభాలు వివరించారు. అంతకుముందు ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని నీటి వనరుల తరుగుదల కు కారణాలు, కలుషితం ఎలా అవుతున్నాయనేది వివరించారు.

భూగర్భ జలాలను పెంపొందించడమే లక్ష్యం..



భూగర్భ జలాలను పెంపొందించడమే తమ లక్ష్యమని.. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో నీటికుంటల తవ్వకాలు చేపడుతున్నామని ఏపీఓ జి.సత్యంనాయుడు తెలిపారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా మండలంలోని కంబర, ఎం.రాజపురం గ్రామాల్లో శనివారం నీటి కుంటల (ఫారం పాండ్స్) తవ్వకాలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఆ గ్రామాలకు చెందిన నాయకులు పాదిలాపు కృష్ణమూర్తినాయుడు, నిమ్మక పాండురంగ, తదితరులు పాల్గొన్నారు. – వీరఘట్టం

‘ఉల్లాస్’ను విజయవంతం చేయండి



వీరఘట్టం: వీఓఏలకు ప్రశ్నపత్రాలను అందజేస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ, పక్కనే ఏపీఎం రాము



భామిని: వీఓఏలకు మెటీరియల్ అందిస్తున్న ఏపీఎం చక్రపాణి, ఉల్లాస్ సిబ్బంది

వీరఘట్టం: నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు తలపెట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ సూచించారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీఎఫ్‌లు, వీఓఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొద్ది నెలలుగా మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వయోజనులకు పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం ఈ పరీక్షలు ఎలా నిర్వహించాలో వివరిస్తూ ప్రశ్నపత్రాలను అందజేసారు. సమావేశంలో ఏపీఎం కె.రాము, వెలుగు సీసీ ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ‘ఉల్లాస్ ’ పరీక్ష

భామిని: వయోజనులకు నిర్వహించే ఉల్లాస్ పరీక్షను ఆదివారం సక్రమంగా నిర్వహించాలని వెలుగు ఏపీఓ మీసాల చక్రపాణి సూచించారు. ఈ మేరకు శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓఏలు, వీటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 38 కేంద్రాలలో 1729 మంది అభ్యాసకులు పరీక్ష రాయనున్నారని చెప్పారు. అనంతరం పరీక్ష మెటీరియల్‌ను అందజేశారు.

జియ్యమ్మవలస: స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ పరీక్ష నిర్వహణపై అవగాహన కల్పించారు. ఏపీఎం త్రినాధమ్మ మాట్లాడుతూ మూడు నెలల పాటు నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా మలిచేందుకు ఉల్లాస్ అనే కార్యక్రమం చేపట్టడం జరిగిందని, ఆ కార్యక్రమంలో భాగంగా మహిళలకు విద్యాబుద్ధులు నేర్పించామన్నారు. ఇప్పుడు దానికి సంబంధించిన పరీక్ష నిర్వహించడం జరుగుతోందన్నారు. ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మొత్తం 49 పరీక్ష కేంద్రాల్లో 1430 మంది పరీక్ష రాయనున్నారన్నారు. రీడింగ్ 50 మార్కులు, రైటింగ్ 50 మార్కులు, గణితం 50 మార్కులకు పరీక్ష ఉంటుందన్నారు. పరీక్ష పక్కాగా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

నాణ్యమైన జీడిపప్పును కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ ఏపీడీ సత్యంనాయుడు

సాలూరు: వీడీవీకేల ద్వారా నాణ్యమైన జీడిపప్పును కొనుగోలు చేయాలని ఐటీడీఏ ఏపీడీ సత్యంనాయుడు అన్నారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల వీడీవీకే కమిటీ సభ్యులతో జీడి పిక్కల కొనుగోలుపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏ గ్రేడ్ జీడి పిక్కల కొనుగోలు చేయాలని తెలిపారు. వీడీవీకేల ద్వారా జీడి పిక్కల కొనుగోలు చేస్తామని జీడి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కొనుగోలుపై మెలకువలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎంలు జయమ్మ, జయకుమార్, శివున్నాయుడు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.